రోడ్డున పడేస్తారా..!

• ఉచిత ఆర్టీసీ సర్వీస్‌పై ఆటో డ్రైవర్ల ఆందోళన • తమకు ఉపాధి కల్పించాలని డిమాండ్

మల్కాపురం: ఆటోవాలాలు రోడ్డెక్కారు. తమ ఉపాధికి గండికొట్టవద్దని నినదించారు.రెక్కల కష్టంపై కుటుంబాలను పోషిస్తున్న తమను ఇబ్బంది పెట్టవద్దని వేడుకున్నారు. ఆదుకోవాల్సిన పాలకులే తమను రోడ్డున పడేస్తారా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

రాష్ట్రంలో ఈ నెల 15వ తేదీ నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయనుండడంతో ఆటో డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ ఉపాధికి గడ్డు పరిస్థితి వస్తుందని వాపోతున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో,గంగరవరం పోర్టు ఇలా పలు పరిశ్రమల్లో కాంట్రాక్ట్ ఉపాధి కోల్పోయిన వారంతా ఆటోలు నడుపుతూ తమ కుటుంబాలను నెట్టుకు వస్తున్నారు. పారిశ్రామిక ప్రాంత పరిధి సింధియా నుంచి జింక్ వరకు సుమారు 1400 మంది ఆటో కార్మికులు ఆటోలను నడుపుతూ తమ కుటుంబాలను పోషిస్తున్నారు.ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తేమహిళలు ఆటో వైపు చూడరని...ఈ కారణంగా తమ జీవనానికి అవస్థలు తప్పవని వాపోతున్నారు. ఉదయం సమయంలో షాపింగ్,కళాశాలలకు లేదా కుటుంబ సభ్యుల ఇంటికి, ఏ శుభకార్యాలకు వెళ్లాలన్నా మహిళలు అధికంగా ఆటోలను ఆశ్రయిస్తుంటారు. ఇప్పుడు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేస్తే వారు ఆటోల వైపు చూడరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశ్రామిక ప్రాంత పరిధిలో సుమారు 18 ఆటో స్టాండ్‌లు ఉన్నాయి.వీటిలో శాశ్వత సభ్యులు 600 మంది వరకు ఉంటే,స్టాండ్‌లు (అంటే యూనియన్‌లలో లేని వారు)మరో 600 మంది ఆటో నడుపుతూ జీవిస్తున్న వారు ఉన్నారు. ఆటో రోడ్డు ఎక్కితేనే వారి ఇంటి దీపం వెలిగేది.

గత ప్రభుత్వం ఆదుకుంటే.. కూటమి రోడ్డున పడేస్తోంది

గత ప్రభుత్వం ఆటో మిత్ర ద్వారా తమను ఆదుకుంటే, ప్రస్తుత కూటమి సర్కార్ ఆటో మిత్ర సంగతి అటు ఉంచితే,తమ బతుకుల్లో నీరు పోస్తుందని ఆటోవాలాలు వాపోతున్నారు. పెరిగిన డీజిల్ ధరలు, ట్యాక్స్‌లతో సతమతమవుతున్న వేళ ఉచిత ప్రయాణం వల్ల మరిన్ని కష్టాలు తెచ్చిపెడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు కూడా ఆర్టీసీ డ్రైవర్లుగా.. బాయ్‌లుగా ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.



చంద్రబాబు తీరుపై నినాదాలు చేస్తున్న ఆటో యూనియన్ సంఘ నాయకులు,కార్మికులు

మా ఉపాధి మాట ఏంటి?



మహిళల కోసం ఉచిత ఆర్టీసీ బస్సు సర్వీసు నడిపితే ఆటోలు ఎవరు ఎక్కుతారు. ఇప్పటికే పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరల వల్ల ఆటో నడపలేని పరిస్థితి. ఇప్పుడు ఆర్టీసీ ఉచిత ప్రయాణం అమలు చేస్తే మరింత గడ్డు పరిస్థితి తప్పదు.

– శ్రీనివాసరావు, ఆటో డ్రైవర్

ఆదుకోవాలి



చదువుకున్నా ఉపాధి లేదు. అయినా ప్రభుత్వంపై ఆధార పడకుండా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు ఉచిత ఆర్టీసీ సర్వీస్ వల్ల మా ఉపాధికి ఇబ్బంది తప్పదు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం మాపై ఇలా వ్యవహరించడం సరి కాదు.మా పరిస్థితిని అర్థం చేసుకుని ఆదుకోవాలి.

– చంద్రరావు, ఆటో డ్రైవర్

ఉపాధికి భరోసా లేదా



మాకు జీవనం ఆటో మాత్రమే. ఆటో నడపడం ద్వారా వచ్చిన ఆదాయంతో భార్యా పిల్లలను పోషించుకుంటున్నాం. అలాంటి ఆటో కార్మికుల కోసం ఆలోచించకుండా పిడుగు పడేటట్టు ఉచిత ఆర్టీసీ సర్వీస్ ప్రవేశ పెడుతుంది. ఆటో ఎక్కే వారి సంఖ్య బాగా తగ్గుతుంది.దీంతో మా ఉపాధి కోల్పోతాం.ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– కుమార్, ఆటో డ్రైవర్

పాలకులకు వినతులు ఇచ్చాం



మా పరిస్థితిపై కూటమి నాయకులు, పాలకులు అనేక మార్లు వినతులు ఇచ్చాం.అయినా స్పందన లేదు. ప్రభుత్వం అంటే అందరికీ మేలు జరిగే నిర్ణయం తీసుకోవాలి. ఒకరికే మేలు,మరికొందరికి కీడు జరిగే విధంగా ఆలోచన చేయరాదు.దీనిపై పాలకులు మరో మారు ఆలోచన చేయాలి.

– కనకరాజు, ఆటో డ్రైవర్

అడ్డంకి ఇలా.. రాకపోకలెలా?

• అత్యవసరమైతే అంతే!



భవానిగార్డెన్స్ ప్రధాన ద్వారం వద్ద అడ్డంగా వేసిన ఇసుక, కాంక్రీట్ పిక్క

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ కూడలి పరిధి భవానీగార్డెన్స్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు కాలనీ వాసులకు పరీక్షపెడుతున్నాయి. సీసీ రోడ్ల నిర్మాణానికి పిక్క, ఇసుక ప్రధాన ద్వారం వద్ద మంగళవారం రాత్రి అడ్డంగా వేయడంతో కాలనీ ప్రజలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందిగా మారింది. వాహనాల మాటేలా ఉన్నా... కనీసం పాదచారులు రాకపోకలు సాగించేందుకు వీల్లేకుండా ఇలా ఇసుక, కాంక్రీట్ పిక్క వేయడం నిర్లక్ష్యానికి నిదర్శంగా కనిపిస్తుందని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు పర్యవేక్షించి స్థానిక ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు లేకండా అభివృద్ధి పనులు చేపట్టాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

చిరువ్యాపారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి దుర్గానగర్, గుడివాడ అప్పన్నకాలనీ, ఎస్సార్‌కాలనీ తదితర ప్రాంతాల్లో చిరువ్యాపారులకు రుణ సదుపాయం కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది.మజ్జి మాలినాయుడు ఆధ్వర్యంలో చిరువ్యాపారుల వద్ద పలు పత్రాలు సేకరించారు. కార్యక్రమంలో సీవో తిరుమలరావు, ఆర్పీ లత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా


వినాయక ఉత్సవాలకు పందిరి రాట



పూజల్లో పాల్గొన్న శ్రీకృష్ణ యాదవ యువజన సేవా సంఘం ప్రతినిధులు

మల్కాపురం: వినాయక ఉత్సవాలను పురస్కరించుకుని 59వ వార్డు కొత్తనక్కవానిపాలెం వద్ద బుధవారం పందిరి రాట వేశారు. స్థానిక శ్రీకృష్ణ యాదవ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో గణనాథుని ఉత్సవాలను 11 రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నారు. రోజూ గణేశుడికి ప్రత్యేక పూజలు, సాయంత్రం సమయంలో మండపం వద్ద సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గ్రంథాలయంలో వార్షిక తనిఖీలు



గ్రంథాలయంలో తనిఖీ చేస్తున్న కార్యదర్శి కుమార్

గోపాలపట్నం: గోపాలపట్నం శాఖా గ్రంథాలయంలో బుధవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు రికార్డులను పరిశీలించారు. పుస్తకాలు భద్రపరిచే తీరును..నిర్వహణ వంటి పలు అంశాలపై ఆరా తీశారు. పాఠకులతో మాట్లాడి అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. అనంతరం నషా ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత చెడు వైపు ఆకర్షితులు కాకుండా మంచి వైపు నడవాలని సూచించారు. లైబ్రేరియన్ ఎస్వీ నరసింహం మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే భవిష్యత్తు నాశనమవుతుందని అన్నారు. పుస్తక పఠనం వ్యసనంగా మార్చుకోవాలని సూచించారు.ఈ మేరకు పాఠకులతో ప్రతిజ్ఞ చేయించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ల అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందిస్తున్న గణబాబు

గోపాలపట్నం: పశ్చిమ నియోజకవర్గం పరిధిలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను బుధవారం ప్రభుత్వ విప్ గణబాబు ఆయన కార్యాలయంలో అందించారు. 89వ వార్డు సంతోష్‌నగర్‌కు చెందిన షేక్ బీబీకి రూ.25000, 90వ వార్డు బాజీ జంక్షన్‌కు చెందిన కడగల భార్గవికి రూ.25000, 92వ వార్డు ఎస్సీబీసీ కాలనీకి చెందిన ఎద్దు గంగమ్మకు రూ.32,527 చెక్కులను అందించారు. కార్యక్రమంలో 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, కంపర ఆనంద్, శరగడం అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటా సర్వే



ఉప్పరకాలనీలో సర్వేలో పాల్గొన్న నాయకులు

మల్కాపురం: కూటమి అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా, వారు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు పూర్తిస్థాయిలో అమలు కాలేదు. కూటమి ప్రభుత్వ మోసాన్ని ఎండగడుతూ బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రజలకు తెలియజేస్తోంది. ఇప్పుడు ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు ఎంతమందికి వచ్చాయి, ఏ పథకాలు రాలేదనే విషయాలపై ఇంటింటా సర్వే చేపడుతోంది. వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ ఆదేశాల మేరకు 58వ వార్డు ఉప్పరకాలనీ వద్ద పార్టీ వార్డు అధ్యక్షుడు కృష్ణ బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధిపై సర్వే చేపట్టారు. ఉప్పరకాలనీ పరిధిలో చాలామంది ఉచిత గ్యాస్ డబ్బులు రాలేదని, తల్లికి వందనం రాలేదని తెలిపారు. వారి ఇంట్లో ఉపాధి లేని కుమారుడు, కుమార్తెలు ఉన్నా ఉపాధి గానీ, ఉపాధి భృతి గానీ రావడంలేదని పలువురు తెలియజేశారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్లు సాల్మన్‌రాజు, గోవింద్, భాస్కర్, అప్పలకొండ, చిన్న, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా జెండా ఎగరాలి



ఎన్ఏడీలో ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గోపాలపట్నం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని బీజేపీ ప్రధాన కార్యదర్శి దాడి రమేష్ నాయుడు కోరారు. ఎన్ఏడీ జంక్షన్‌లో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఎన్ఏడీ జంక్షన్ నుంచి బాజీ జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా రమేష్ నాయుడు మాట్లాడుతూ ప్రధాన మంత్రి పిలుపు మేరకు ప్రతీ ఇంటిపై 15న జెండా ఎగరవేసేలా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మణికంఠ, లాస్య, కరుణాకర్, గజపతిరావు, మంజుల జ్యోతి శ్రీనివాసరావు, కాళ్ల అశోక్, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కాళీమాత ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడాలేఅవుట్‌లో కాళీమాత ఆలయ నిర్మాణానికి శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పాల్గొని పూజలు చేశారు. కాలనీ వాసులు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ కాలనీలో విఘ్నేశ్వరాయలయం, శివాలయంతో పాటు కాళీ మాత ఆలయం నిర్మాణం జరుగుతుందని అన్నారు. వుడాలేఅవుట్ ప్రశాంతతకు నియలంగా ఉండేదని ఇపుడు ఆధ్యాత్మిక నిలయంగా మారుతోందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సామిత్ర దత్తా, జనరల్ సెక్రటరీ స్వపన్ పాత్ర, జాయింట్ కార్యదర్శి ఎస్. సురేష్‌కుమార్, వుడాకాలనీ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్‌వీ సురేష్, యముజల తిరుమలరావు, డి. సూర్య నారాయణ, మురళీ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు నాశనం



ఆర్పీపేట పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా పోలీసులు, విద్యార్థులు



విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ సతీష్

కంచరపాలెం: మత్తుకు బానిసలు అయితే జీవితాలు నాశనమవుతాయని సచివాలయ మహిళా పోలీసులు పద్మావతి, ఎస్వీ లక్ష్మి అన్నారు. జీవీఎంసీ 56వ వార్డు రామ్మూర్తిపంతులుపేట పాఠశాలలో గొల్లకంచరపాలెం–ఆర్పీపేట అంగన్‌వాడీ కార్యకర్తలు టి.విజయలక్ష్మి, ఎస్.సుశీల ఆధ్వర్యంలో బుధవారం నశా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞను విద్యార్థులచే చేయించారు. మత్తుకు బానిసలు కావడం వల్ల కుటుంబంతో పాటు దేశం కూడా నష్టపోతుందన్నారు. కార్యక్రమంలో ఆయాలు కుమారి, లక్ష్మి, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండండి

గోపాలపట్నం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పెందుర్తి సీఐ కేవీ సతీష్ అన్నారు. నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాగింగ్– మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి సీఐ మాట్లాడుతూ ర్యాగింగ్ చేయడం నేరమని వివరించారు. విద్యార్థి దశలో ఆకతాయి చర్యలు భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారుతాయన్నారు. మత్తు పదార్థాల వల్ల మానసిక, శారీరక సమస్యలు వస్తాయని తెలిపారు. మహిళల పట్ల సోదర భావంతో మెలగాలని సూచించారు. వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా.. వేధించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యాజమాన్యం కూడా ఇలాంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భం సే నో టు డ్రగ్స్ ప్రతిజ్ఞను విద్యార్థుల చేత చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ ప్రదీప్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలోని శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మి పూజలు బుధవారం 20వ రోజుకు చేరుకున్నాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరంతో లక్ష్మి పూజలు ప్రారంభించారు. ఈ పూజలో పలువురు భక్తులు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట కూడా పూజలు చేసి, వారికి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపించారు. ఈ పూజలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ కార్యనిర్వాహణాధికారిణి కె. శోభారాణి తెలిపారు. మరిన్ని వివరాల కోసం 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి కె.రాజేంద్రకుమార్, ఆలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవ కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు వంటి పలు అభివృద్ధి పనులకు వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా బుధవారం శంకుస్థాపన చేశారు. చింతల్లోవ కొండవాలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే సమయంలో రక్షణ గోడలు లేక బండరాళ్లు, మట్టి జారి ఇళ్లు కూలిపోతాయనే భయంతో స్థానికులు బిక్కు బిక్కు మంటూ గడుపుతున్నారన్నారు. కొండవాలు ప్రాంతాల్లో సరైన రోడ్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఉన్నతాధికారులు దృష్టికి సమస్యను తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించారు. కార్యక్రమంలో జెర్రిపోతుల నర్సింగరావు, గూడెల కృష్ణ, పుక్కల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాడ లేని కంది పప్పు

మహారాణిపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా, రేషన్ దుకాణాల్లో కందిపప్పు సరఫరా సరిగా జరగడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నిరంతరం కందిపప్పు పంపిణీ జరిగేదని, అయితే ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని నెలల్లో మాత్రమే కందిపప్పు ఇచ్చిందని, అది కూడా పూర్తిగా కాకుండా అరకొరగా ఇచ్చిందని కార్డుదారులు వాపోతున్నారు. ప్రతి నెలా కందిపప్పు ఎప్పుడు ఇస్తారని రేషన్ డీలర్లను అడుగుతుండగా, సరైన సమాధానం చెప్పలేక డీలర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అనేక రకాల నిత్యావసరాలు ఇస్తామని హామీ ఇచ్చినా, ప్రస్తుతం కేవలం బియ్యం , పంచదార మాత్రమే ఇస్తున్నారని పేద ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 5,12,619 తెలుపు రేషన్ కార్డులు, 625 చౌకధరల దుకాణాలు ఉన్నాయి. జిల్లాలోని మధురవాడ, ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి, గాజువాక, పెదగంట్యాడ వంటి ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. గతంలో కిలో కంది పప్పును రూ. 70 చొప్పున పంపిణీ చేసేవారని, ఆ విధానం ఇప్పుడు కనుమరుగైందని ప్రజలు చెబుతున్నారు. కందిపప్పు, రాగి పిండి, వంటనూనె వంటి నిత్యావసరాలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు కేవలం అరకొర సరుకులతో సరిపెడుతున్నారని ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు.

పత్రికా ప్రకటన మహారాజశ్రీ II అడిషనల్ సివిల్ జడ్జ్ (సీనియర్ డివిజన్), వారి కోర్ట్ , విశాఖపట్నం జిల్లా, విశాఖపట్నం

ఐ.పి. నెం. 3/2024

పిటిషనర్స్ వారి పేరు అడ్రస్సులు.:-

పిల్లి కనకరాజు, తండ్రి లేటు దేముడు, నివాసం ఫ్లాట్ నెం. 302, విజయ రెసిడెన్సీ, నియర్ విజయం స్కూల్, కొమ్మాది, చినగాదిలి మండలం, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్.

మరియు

రెస్పాండెంట్స్:– దేవర భాగ్యలక్ష్మి మరియు 8 మంది వగైరాలు,

రెస్పాండెంట్స్ వారి పేరు అడ్రస్సులు:-

1వ, రెస్పాండెంట్: దేవర భాగ్యలక్ష్మి, భర్త లేటు నారాయణ, డ్వాక్రా సంఘంలో ఆర్‌పి, డి.నెం. 10–24–3, దేవిసి ఫుడ్స్ వెనుకభాగం, మారికవలస, విశాఖపట్నం.

2వ, రెస్పాండెంట్: పిట్టాడ ఉదయ్‌లక్ష్మి, భర్త: రామకృష్ణ, డ్వాక్రా సంఘంలో ఆర్‌పి, డి.నెం. 16–15–142, ఆర్.హెచ్. కాలనీ, పి.ఎం.పాలెం, చినగదిలి మండలం, విశాఖపట్నంలో నివసిస్తున్నారు.

3వ, రెస్పాండెంట్: పిట్టాడ రామకృష్ణ, తండ్రి లేటు అప్పారావు, మార్గదర్శి చిట్స్ పనిచేస్తున్నారు, డి.నెం. 14–15–142, ఆర్.హెచ్. కాలనీ, పి.ఎం.పాలెం, చినగదిలి మండలం, విశాఖపట్నం.

4వ, రెస్పాండెంట్: బమ్మిడి సూరి, తండ్రి రాము, క్యాటరింగ్ సరఫరాదారులు, డి.నెం. 9–134, రిక్షా కాలనీ, మధురవాడ, విశాఖపట్నంలో నివసిస్తున్నారు.

5వ, రెస్పాండెంట్: బనన తోటయ్య, భర్త: నరసయ్య, డి.నెం. 9–142, రిక్షా కాలనీ, మధురవాడ, విశాఖపట్నం.

6వ, రెస్పాండెంట్: బనన నరసయ్యమ్మ, భర్త: లక్ష్మణరావు, గృహిణి, నివాసం డి.నెం. 9–104, రిక్షా కాలనీ, మధురవాడ, విశాఖపట్నం.

7వ, రెస్పాండెంట్: చిగురుపల్లి రేణుక, భర్త: రామారావు, డ్వాక్రా సంఘంలో ఆర్.పి., నివాసం డి.నెం. 12–2–142, సాయిరాం కాలనీ, మధురవాడ, విశాఖపట్నం.

8వ, రెస్పాండెంట్: సింగూరు మణి, భర్త రమణ, లాండరింగ్ షాప్, నివాసం కె-3 కాలనీ, బక్కన్నపాలెం, ఎదురుగా సహోదయ స్కూల్, చినగదిలి మండలం, విశాఖపట్నం జిల్లా.

9వ, రెస్పాండెంట్: మాధవ మహాలత, భార్య: పద్మజ లక్ష్మి, గృహిణి, డి.నెం. 12–15–142, ఆర్.హెచ్.కాలనీ, పి.ఎం.పాలెం, చినగదిలి మండలం, విశాఖపట్నం.

పై నెంబరు పిటీషను లో పిటీషనర్ అయిన పిల్లి కనకరాజు గారిని ఇన్సాల్వెంట్ గా ఉత్తర్వులు జారి చేయమని మరియు వీరి తాలుకు ఆస్తులు ను అఫీషియల్ రిసీవర్ గారిని అప్పగించుట చేయమని శ్రీయుత పై వారి కోర్టు లో పిటీషను దాఖలు చేసుకొని యున్నారు. దాని పై ప్రజానీకానికి ఎవ్వరికైనా అభ్యంతరములు ఉన్న యెడల ది. 15/9/2025 తేది ఉదయం గం. 10.30 ని॥లకు శ్రీయుత పై వారి కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి వారి అక్షేపణలు తెలియచేసుకోనవలెను.

కె. దీపక్ అరవింద్, బద్ది వరహాలరావు, బద్ది శిరీష, న్యాయవాదులు, ఏలూరు, సెల్: 94406 53935, 90599 11539

మహాప్రసాదం.. నిత్యాన్నదానం



సింహగిరిపై నిత్యాన్నదాన పథకంలో సింహాచలం దేవస్థానం అందించే అన్నప్రసాదాన్ని భక్తులు మహాప్రసాదంగా భావిస్తారు. శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకున్న అనంతరం అన్నప్రసాదం స్వీకరించే తిరుగుపయనం అవ్వాలని చాలా మంది భక్తులు తపిస్తుంటారు. ఇంతటి విశిష్టత కలిగిన అప్పన్న నిత్యాన్నదాన పథకం అమల్లోకి వచ్చి నేటి(ఆగస్టు 14)తో 36 వసంతాలు పూర్తిచేసుకుని 37వ వసంతంలోకి అడుగుపెడుతోంది.

సింహాచలం: రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో సింహాచలం ఒకటి. ఇక్కడ కొలువైన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు రోజూ దేశ విదేశాలకు చెందిన భక్తులు వస్తుంటారు. వీరిలో ఒడిశా, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల భక్తులే ఎక్కువ. స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఉచితంగా అన్నప్రసాదాన్ని అందించాలని 1989 ఆగస్టు 14న నిత్యాన్నదాన పథకాన్ని ప్రారంభించారు. అప్పట్లో దేవస్థానంలో పనిచేసిన ఉద్యోగులే ఈ పథకానికి రూ.50 వేలు తొలి విరాళం అందించారు. అప్పటి నుంచి ఈ పథకానికి దాతల నుంచి విశేష స్పందన లభిస్తోంది.



అన్నప్రసాదాన్ని భక్తులకు వడ్డిస్తున్న సిబ్బంది

నేటితో **36** వసంతాలు పూర్తిచేసుకున్న సింహాచల దేవస్థానం నిత్యాన్నదాన పథకం

మార్చి 31 నాటికి రూ.**36.45** కోట్లకు చేరిన డిపాజిట్లు

ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు మరో రూ.**2.20** కోట్లు

రూ.38 కోట్లకు పైగా విరాళాలు

2024–25 ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి నిత్యాన్నదాన డిపాజిట్లు 36 కోట్ల 45 లక్షల 41 వేల 720 రూపాయలకు చేరుకున్నాయంటే అది భక్తులకు సింహాచలేశుడిపై ఉన్న అచంచల విశ్వాసమే..! ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు మరో రూ.2.20 కోట్ల డిపాజిట్లు వచ్చాయి. ఈ విరాళాలను బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, వాటిపై వచ్చే వడ్డీతో భక్తులకు నిత్యం దేవస్థానం అన్నప్రసాదం అందిస్తోంది.

దాతలకు ప్రత్యేక ప్రాధాన్యత

నిత్యాన్నదాన పథకానికి విరాళాలందించే దాతలకు ప్రత్యేక గుర్తింపు ఉటుంది. రూ.10,116 ఆపై విరాళం అందించే దాతలకు దేవస్థానం బాండ్‌లు అందిస్తుంది. ఆ రోజు పరిస్థితి ఆధారంగా స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పిస్తారు. దీంతోపాటు ఏడాదిలో వారు కోరుకున్న రోజున వారి పేరు మీద భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తారు. ఆ వివరాలను ఆ రోజు అన్నప్రసాద భవనం బోర్డులో పేర్కొంటారు.

రూ.10,116 లోపు వచ్చే విరాళాలను స్వల్ప విరాళాలుగా పరిగణిస్తారు. వాటిని ప్రొవిజన్స్, ఇతర ఖర్చులకు వెచ్చిస్తారు.

రోజువారీ అన్నప్రసాదం

సింహగిరిపై ఉన్న అన్నప్రసాద భవనంలో రోజూ ఉదయం 11.30కు వడ్డన ప్రారంభమవుతుంది. సోమ నుంచి శుక్రవారం వరకు రోజూ 2 వేలు నుంచి 3,500 మందికి, శనివారాలు 5–7 వేలు, ఆదివారం రోజుల్లో 4–6 వేల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తారు. రోజూ రాత్రి పూట 200–500 మంది భక్తులకు కదంబం(ముక్కల పులుసు అన్నం) అందిస్తారు.

పథకం ప్రారంభం
ఆగస్టు 14, 1989

ఒక్కో భక్తుడికి భోజనం ఖర్చు రూ.35

ఏడాదికి డిపాజిట్లపై వచ్చే వడ్డీ
రూ.2.20కోట్లు

స్వల్ప(రూ.10,116 లోపు) విరాళాలు
ఏడాదికి రూ.1.80 కోట్లు

విరాళాల వారీగా దాతల కేటగిరీ

మహారాజ పోషకులు
రూ.లక్ష ఆపై ఇచ్చే దాతలు

రాజపోషకులు రూ.50 వేలు దాటి ఇచ్చేవారు

పోషకులు రూ.10 వేలు ఆపై ఇచ్చేవారు

దాతలు రూ.1,116లు ఇచ్చిన వారు

(ఇప్పటి వరకు రూ.10 లక్షలకు పైగా విరాళం ఇచ్చిన వారు నలుగురుండగా, రూ.లక్ష ఆపై విరాళాలు అందించిన వారు 1,219 మంది ఉన్నారు.)